క్లుప్తంగా

జాతీయ పోటీలకు నంద్యాల క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పల్లవి, మహేష్, రాజు, లక్ష్మీనర సింహ పతకాలు సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు ఒలింపిక్ సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ చైర్మన్ రవికృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కళారాధన సభ్యులు రమణయ్య తెలిపారు. క్రీడాకారులను మంగళవారం కార్యాలయంలో అభినందించారు. అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొం టున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతకు సహకరించండి



అహోబిలం రోడ్డుపై వ్యర్థాలను తొలగిస్తున్న అటవీ ఉద్యోగులు

రుద్రవరం: ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించే వారు స్వచ్ఛతకు సహకరించాలని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతినాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని హరినగరానికి సమీపాన ఉన్న సాయిబాబ మందిరం నుంచి అహోబిలం వైపు దుర్గమ్మ గుడి వద్దకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను అటవీ ఉద్యోగులు తొలగించారు. వాహనచోదకులు, బాటసారులు ప్లాస్టిక్, వ్యర్థాలను రోడ్డుపై వేయొద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టర్లు శ్రీనివాసరెడ్డి, రాణెమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన కాలికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవా నిర్వహించారు. ఒడి బియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారు. ఈ నెల 21న కర్నూల్లో జరిగిన అండర్–17 విభాగం సెపక్‌తక్రలో విద్యార్థి వేమా నారాయణరెడ్డి ప్రతిభ చాటాడు. 23న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో యుగంధర్, ధర్మ దస్తగిరి, వెంకట సంతోష్ కుమార్‌రెడ్డి, రోప్ స్కిప్పింగ్ విభాగంలో వేమా నారాయణరెడ్డి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు బాబును హెచ్ మురళీధర్ అభినందించారు.

ఖలీల్ మౌలానా మృతి తీరని లోటు

నంద్యాల(న్యూటౌన్): ముస్లిం మత పెద్ద ఖలీల్ మౌలానా మృతి ముస్లిం సమాజానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ అలీజ్, షమీమ్‌బాను, అంజాద్‌షరీఫ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ గుండెపోటుతో మరణించిన ఖలీల్ మౌలానా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల(రూరల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు. మంగళవారం చాంద్‌బాడా, ముల్లాన్‌పేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

- పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తప్పని సరి
- ముఖానికి మాస్క్.. శరీరం నిండా దుస్తులు ధరించాలి
- నిర్లక్ష్యంతో ప్రమాణానికే ముప్పు

రైతన్నా.. అజాగ్రత్త వద్దన్నా!

రైతన్నలు తమకు జ్వరం వచ్చినా అంతగా బాధ పడరు కానీ.. పైరుకు పురుగు ఆశిస్తే మాత్రం విలవిల్లాడి పోతారు. అప్పోసప్పో చేసి రసాయన మందులు తెచ్చి పిచికారీ చేస్తుంటారు. పిచికారీ చేసే సమయంలో కనీస జాగ్రత్తలు కూడా తీసుకోరు. అదే ఒక్కోసారి వారి ప్రాణాల మీదకు వస్తుంది. మందు ప్రభావంతో కొందరు మృత్యువాత పడిన సందర్భాలు కూడా లేకపోలేదు. అందుకే రైతన్నలను అప్రమత్తం చేస్తూ 'సాక్షి' కథనం.



వరి పొలానికి మందులు పిచికారి చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునే ప్రయత్నంలో కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను కూడా తీసుకోవడం లేదు. దీనివల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. శరీరంలోకి విషం వెళ్లే మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

చర్మం ద్వారా..

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా..

క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తూ ఉంటే ముక్కుకు జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

నోటి ద్వారా..

పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కోసారి మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవిస్తుంది.

ఇలా చేయాలి..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమిసంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళితే వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

జాగ్రత్తలతో ప్రయోజనం..

- మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కొన్ని రకాల మందులు కళ్లలో పడితే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.
- మందులు పిచికారీ సమయంలో మద్యం తాగడం, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి పీల్చడం చేయరాదు.
- మధ్యాహ్నం సమయంలో ఎండవేడి ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయకూడదు.
- మందులు పిచికారీ చేసే సమయంలో వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- గాలి వాటానికి ఎదురెళ్తూ పొలంలో మందులు చల్లకూడదు.
- పురుగు మందులు పిచికారీ చేసిన తరువాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- మందు వినియోగించిన తర్వాత డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యి తీసి పాతి పెట్టాలి, లేదా నిప్పు పెట్టి కాల్చివేయాలి.
- మందులు పిచికారీ చేసే చేస్తున్నప్పుడు లేదా చేసిన తర్వాత ఎవరైనా విష ప్రభావానికి లోనై వాంతులు చేసుకుంటున్నా కళ్లు తిరుగుతున్నా, చర్మంపై దురద పెడుతున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి ప్రథమ చికిత్స చేయించుకోవాలి.

పురుగు మందుల పిచికారీతో ప్రమాదం



ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసే సమయాల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది. ముఖానికి మాస్క్ ధరించడంతోపాటు ఎదురు గాలికి మందు పిచికారీ చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యులతో చికిత్స చేయించుకోవాలి.

–గోపాల్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గోస్పాడు

జాగ్రత్తలు పాటించాలి



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించాలి. రైతులు ప్రతి ఏడాది పొలాల్లో వేసే మందులను పైర్లకు అనుగుణంగా వేయాలి. మోతాదుకు మించిన ఎరువు మందుల వాడకం పైర్లను కూడా దెబ్బతీసే అవకాశం ఉంది. మందుల పిచికారీ సమయంలో రైతులు తప్పని సరి నిబంధనలు పాటించాలి.

– స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు

ఎంపీడీఓగా సావిత్రి

దొర్నిపాడు: స్థానిక ఎంపీడీఓగా సావిత్రిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె తుగ్గలి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి రానున్నారు. అలాగే ఈఓ(పీఆర్ అండ్ ఆర్డీ)గా సులోచన పత్తికొండ మండలం నుంచి బదిలీపై వస్తున్నారు. పీఆర్‌ఈఓగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహులు డీఈగా పదోన్నతిపై ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. అలాగే గుండుపాపల గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ సంజామలకు, కొండాపురం కార్యదర్శి సుమిత్ర ఉయ్యాలవాడ మండలం కొండుపల్లికి, దొర్నిపాడు కార్యదర్శి నాగార్జున చాకరాజువేములకు బదిలీపై వెళ్లనున్నారు. అలాగే రుద్రవరం మండలం ఆర్.నాగులవరం నుంచి క్రిష్టిపాడు కార్యదర్శిగా ఎ.ఓబులేసు, గుండుపాపల కార్యదర్శిగా శిరివెళ్ల మండల కోటపాడు నుంచి షరీఫాబీను ఉన్నతాధికారులు నియమించారు.

రెవెన్యూ శాఖలో

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవీ సంజామలకు, కొండాపురం వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న రాధ ఆళ్లగడ్డ మండలం పాతకందుకూరు బదిలీ అయినట్లు ఉత్తర్వులు వచ్చినట్లు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఏఈగా త్రిలేంగేశ్వరరెడ్డి

శిరివెళ్ల: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా త్రిలేంగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. గతంలో ఏఈగా పని చేసిన కిరణ్‌కుమార్ అవుకు మండలానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో ఈయనను ఉన్నతాధికారులు నియమించారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఉయ్యాలవాడ : ప్రజల శ్రేయస్సే తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండల కేంద్రం ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీకి మంజూరయిన నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు.

విద్యాహక్కును కాలరాయడమే



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సీబీఎస్‌ఈ పరీక్షల్లో ఉర్దూ భాషను నిరాకరించడం విద్యాహక్కును కాలరాయడమేనని ముస్లిం సంఘాల జేఏసీ నంద్యాల గౌరవాధ్యక్షులు ఎండీ అబులైజ్, అబ్దుల్‌సమ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉర్దూ మీడియం విద్యార్థులు తమ మాతృభాషల్లో అనుమతి లేకుండా పరీక్షలు రాయకూడదనే సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) వివక్ష పూరిత నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆదేశాలతో ఉర్దూ భాషపై వివక్షతో తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు జాకీర్, మునీర్ అహమ్మద్, అర్షద్, యూనిస్, షఫీ పాల్గొన్నారు.

28న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈనెల 28న నూనెపల్లె మున్సిపల్ క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపీ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండల స్థాయి పోటీల్లో ఎంపికైన వారితోపాటు ఆయా సందర్భాల్లో పాల్గొనలేక పోయిన విద్యార్థులు కూడా హెచ్‌ఎంల ధ్రువీకరణ పత్రంతో హాజరు కావచ్చన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో అండర్–14, అండర్– 17 విభాగాల బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న వైనాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణానికి కృషి చేయాలన్నారు. సమాజం కోసం పాటుపడే విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు కాటంరెడ్డి రామలింగారెడ్డి, విజయానంద్, శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో..

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్టోరేజ్ వాటర్ ట్యాంకు గురించి అవగాహన కల్పించారు. నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు రక్తదానం, సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు.

సమసమాజ స్థాపనే లక్ష్యం



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సమసమాజ స్థాపనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ సంస్థ లక్ష్యమని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు అన్నారు. సంస్థ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరరావు, కార్యదర్శి సురేంద్రబాబు, జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి బొమ్మలసత్రం వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, సుభాష్, ఓబులేసు పాల్గొన్నారు.

26న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు భూమిని శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వీధికుక్కలు, దోమలతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కిల్‌డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ స్పోకెట్ ఇంగ్లిష్, ఆర్ట్, డ్యాన్స్, సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నైమా పాల్గొన్నారు.

వీబీఆర్‌కు జలకళ



నీటితో కళకళలాడుతున్న వీబీఆర్

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 16.32 టీఎంసీల నీటి నిల్వలతో జలకళను సంతరించుకుంది. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 4,800 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 520 క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5,000 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ ప్రధాన రహదారికి దగ్గర ఉండడంతో శ్రీశైలం మహానందికి వెళ్లే యాత్రికులతో సందడి నెలకొంది.

హత్య కేసు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీశైలం: శ్రీశైలంలోని పాతాళ గంగ పాత మెట్ల మార్గం వద్ద జరిగిన హత్య కేసు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను టూటౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ చంద్రబాబు విలేకరులకు వెల్లడించారు. మార్కాపూర్‌కు చెందిన అశోక్ (50) ఈనెల 21న అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాపట్ల బాలగంగాధర్, కడప మధుసూదన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని సీఐ తెలిపారు. అశోక్‌తోపాటు నిందితులిద్దరూ పాతాళగంగకు వెళ్లే యాత్రికులకు నుదుటిన బొట్లు పెడుతూ జీవనోపాధి పొందేవారు. ముగ్గురూ మద్యం తాగి గొడవ పడటంతో అశోక్ హత్యకు దారి తీసినట్లు విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆకట్టుకుంటున్న జలపాతం



బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల గ్రామ సమీపంలో ఉన్న గుండం మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఉన్న జలపాతం నుంచి జాలువారుతున్న నీరు భక్తులను ఆకట్టుకుంటోంది. సోమవారం రాత్రి డోన్ మండలంలోని చిన్న మల్కాపురం, పెద్దమల్కాపురం కమలాపురం తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జలపాతానికి వరద నీరు చేరుతోంది. ఈ నీరు సమీపంలో ఉన్న పసుపల చెరువుకు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జలపాతం తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

రేపు చేతివృత్తిదారుల సమాఖ్య సమావేశం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26న స్థానిక సీపీఐ కార్యాలయంలో చేతి వృత్తి దారుల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమావేశానికి చేతి సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫ కృద్దీన్ హాజరవుతున్నారని చేతివృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పత్తిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ



బాచిపల్లిలో పాల్గొన్న అధికారులు



రైతులకు సూచనలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

దొర్నిపాడు: పత్తి సాగులో రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే తప్పని సరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ సూచించారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి సునీతతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీఏ ప్రారంభించారు. పత్తి పంటను పరిశీలించిన వారు గులాబీ రంగు పురుగును సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి నివారించుకోవాలన్నారు. 40 రోజుల పంటకు తప్పని సరిగా లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మల్లికార్జున, శేఖర్ రెడ్డి, పెద్దయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ, ఎల్లావత్తుల గ్రామాల్లో మంగళవారం ఏఓ శ్రీకృష్ణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వాతవరణ ప్రతికూల ప్రభావంతో వరిలో బ్యాక్టీరియా, ఆకు మచ్చ, అగ్గి తెగులు సోకుతున్నాయని, నివారణకు సుడోమోనాస్ 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రేవతి,రేష్మ, శివక్రిష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండల పరిధిలోని జీనేపల్లె, గుంప్రమాన్‌దిన్నె గ్రామాల్లో మంగళవారం డీఆర్సీ ఏఓ ప్రభావతమ్మ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక పద్ధతులను ఏఓ రైతులకు వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ టెక్నికల్ ఆఫీసర్ శివారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని బాచిపల్లి,అహోబిలం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వరి, కంది పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం ద్వారా భూమి సారవంతం కోల్పోవడంతోపాటు రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాణెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి, రైతులు పాల్గొన్నారు.



వైద్యం కోసం ఎదురు చూస్తున్న రోగులు



మందులు ఇస్తున్న ఫార్మసిస్టు

వైద్యసేవలపై 'సమ్మె'ట



రుద్రవరం పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

రుద్రవరం: గ్రామాల్లో పేద ప్రజలకు వైద్యమందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన బాట పట్టారు. వారి భవిష్యత్‌కు బంగారుబాట వేసే ఇన్‌సర్వీస్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం కుదిస్తూ జీఓ 85ను తీసుకువచ్చింది. దీనిపై వారు వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈనెల 16 నుంచి విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు. రుద్రవరం మండలంలో ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలాయి. డాక్టర్లు విధుల బహిష్కరణతో రుద్రవరం, నర్సాపురం, ఆలమూరు పీహెచ్‌సీల్లో ఓపీ, అత్యవసర సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. తప్పని పరిస్థితిలో కొందరు స్టాఫ్‌నర్సులు,ఫార్మసిస్టులతో వైద్యం చేయించుకుంటుండగా..మరికొందరు ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వైద్యులు విధుల్లో చేరేలా చూడాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.